ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం 14 మార్చి 2025







- మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విభేదాలను రూపుమాపే పనిలో పార్టీ పెద్దలు
- రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభావం ఉండొద్దంటూ సీఎం సూచన
- మంత్రి సీతక్క నివాసంలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు విందు
- పరస్పర కుశల ప్రశ్నలు, పలకరింపులతో సాగిన భేటీ
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశమైన 'విందు రాజకీయం'

హస్తంలో.. ఐక్యత సాధ్యమేనా?

ఓరుగల్లు నేతల సఖ్యతపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

తొలి నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నేతల మధ్య సఖ్యత అంతం తమాత్రమేనన్న విషయం అందరికీ తెలిసిందే. ఎమ్మెల్యేలు, మంత్రులు మధ్య విభేదాలు రచ్చకెక్కిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. నేతల మధ్య పెరిగిన ఈ దూరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం చూపుతుందనే ఆందోళనలో ఉన్న పార్టీ అధిష్ఠానం.. చొరవ తీసుకుని సఖ్యత కుదిర్చే పనిలో పడింది. ఈ నేపథ్యంలో మంత్రులే చొరవ తీసుకుని ఎమ్మెల్యేలతో కలిసి వెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో సూచించినట్టు సమాచారం. దీంతో మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలకు హైదరాబాద్‌లో విందు ఇచ్చారు. ఇప్పుడీ విషయం ఓరుగల్లు పాలిటిక్స్‌లో చర్చనీయాంశమైంది. ఇలా ఓరుగల్లు కాంగ్రెస్ నేతల మధ్య ఐక్యత తేవడంపై అధిష్ఠానం దృష్టి పెట్టగా.. నేతల మధ్య ఐక్యతపై కొమ్మాలలో జరుగనున్న జాతర ప్రభ బండ్లు బల ప్రదర్శనతో స్పష్టత రానుందన్న చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో అధిష్ఠానం ప్రయత్నాలు ఫలిస్తాయా? నేతల మధ్య ఐక్యత సాధ్యమవుతుందా? అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది.

మంత్రులు వర్సెస్ ఎమ్మెల్యేలు..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కొండా సురేఖ, సీతక్కలకు మంత్రులుగా అవకాశం లభించింది. వీరితో పాటు ఖమ్మం జిల్లాకు చెందిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రిగా నియమించారు. అయితే మొదటి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య గ్యాప్ తీవ్రంగా ఉంది. మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మధ్య రాజకీయ వైరం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అంతేకాకుండా నామినేటెడ్ పదవుల విషయంలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య వైరం ఏఐసీసీ వరకు వెళ్లింది. భద్రకాళి చెరువు పూడికతీత విషయంలోనూ ఓ మంత్రితో కొంతమంది ఎమ్మెల్యేలకు దూరం పెరిగిందనే టాక్ వినిపించింది. చివరకు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఒకరికి పదవి రాకుండా మరోకరు అధిష్ఠానం వద్ద ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వినిపించాయి. మొత్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల మధ్య గ్యాప్ తీవ్రంగా ఉందనే విషయాన్ని అధిష్ఠానం సీరియస్‌గా తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

ఎన్నికల్లో ప్రభావంపై ఆందోళన

ఉమ్మడి జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య పెరుగుతున్న దూరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభావం పడే ఛాన్స్ ఉందని కాంగ్రెస్ అధిష్ఠానంతో పాటు శ్రేణులు కూడా ఆందోళనలో ఉన్నాయి. వరంగల్‌కు టెక్స్‌టైల్ పార్కు, ఐటీ సెక్టార్, ఎయిర్‌పోర్టు, భూగర్భ డ్రైయినేజీ తదితర వాటితో వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తుంటే.. నేతల మధ్య వచ్చిన గ్యాప్ క్యాడర్‌ను అయోమయానికి గురి చేస్తుందని అధిష్ఠానం భావిస్తోంది. టీపీసీసీలో పదవులతో పాటు

మిగతా 7వ పేజీలో...

కొమ్మాలలో బలప్రదర్శనకు రెడీ

కాంగ్రెస్‌లో ఐక్యతకు శుక్రవారం వరంగల్ జిల్లా గీసుకొండలో జరిగే కొమ్మాల జాతరలో తేలనుందనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అనుచరులు ప్రభబండ్లు ఏర్పాటు చేస్తుండగా, వారికి దీటుగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ అనుచరులు భారీ ఎత్తున ప్రభబం డ్లతో బలప్రదర్శనకు సిద్ధమవుతున్నా రనే చర్చ ఉంది. రేవూరి వర్గం నుంచి కొందరు కీలక నేతలు కొండా వర్గంలో చేరటంతో రెండు వర్గాల మధ్య వార్ ము దురుతోంది. దీంతో బందోబస్తుకు 500మందికి పైగా పోలీసులను మోహరించారు. ఇక్కడే జరిగే ప్రభబండ్ల ప్రదర్శన కాంగ్రెస్‌లో నేతల ఐక్యతపై ప్రభావం పడనుందనే చర్చ జరుగుతోంది.

పుష్కరాల పనులు వేగవంతం చేయాలి

అధికారులతో కలెక్టర్ రాహుల్‌శర్మ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి మండలంలోని కాళేశ్వరంలో ఆయన గురువారం పర్యటించారు. కాళేశ్వర ముక్తీశ్వర దేవస్థానం కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. మే 15 నుంచి త్రివేణి సంగమం కాళేశ్వర గోదావరిలో పుష్కరాలు ప్రారంభమువుతున్నాయన్నారు. భక్తుల సౌకర్యార్థం వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ. 25 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. టెండరు ప్రక్రియ పూర్తయి 20 రోజులు గడిచినా ఇప్పటి వరకు పనులు ప్రారంభించకపోవడం ఏమిటని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యుత్, పోలీసు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సమన్వయంగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అందరి సహకారంతోనే పుష్కరాలు విజయవంతమవుతాయని తెలిపారు. పుష్కరాల సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, పోలీసు శాఖ తీసుకోనున్న చర్యల గురించి ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడారు. పుష్కరాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలనకు తావి లేకుండా పోలీసు శాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇతర శాఖ అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ పుష్కరాలను విజయవంతం చేయాలన్నారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ సమావేశం అనంతరం వీఐపీ ఘాట్ వద్దకు కలెక్టర్, ఎస్పీ వెళ్లారు. ఏయే పనులు జరుగుతున్నాయి.. ఇంకా ఏం పనులు చేయాల్సి? అమ్మవారి విగ్రహం ఎక్కడ ప్రతిష్ఠించాలనే అంశాలపై చర్చించారు. భక్తులకు రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులపై అధికారులకు సూచనలు చేశారు. గోదావరిని పరిశీలించిన కలెక్టర్ నదీ అంతటినీ చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి వద్ద వీఐపీ ఘాట్‌లో అదనంగా మెట్ల పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. దీంతో పాటు రోడ్డు పనులను కూడా వెంటనే పనులు ప్రారంభించి త్వరలోనే పూర్తి చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇసుక లేకపోవడంతో పనులు ఇంకా ప్రారంభించలేదని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కలెక్టర్ స్పందించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ మహేష్, అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్, అడిషనల్ కలెక్టర్ తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోటంచ జాతర

మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు



6వ పేజీలో..

మాయమాటలకు మోసపోవద్దు

- తెలియని యాప్‌లు, ఫోన్స్ కాల్స్, లింక్‌లకు స్పందించొద్దు
- సైబర్ క్రైం జరగగానే 1930 కాల్ చేయాలి
- స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావాలి
- సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్
- 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన


ఫోన్‌ఇన్‌లో సందేహాలను నివృత్తి చేస్తున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్

వివరాలు 7వ పేజీలో..

యువతలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే ఉత్సవాలు

డీఈవో రాజేందర్


జ్యోతిప్రజ్వలన చేస్తున్న జిల్లా డీఈవో, ఇతర ఉన్నతాధికారులు

భూపాలపల్లిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): యువతలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకే యువజనో త్సవాలు నిర్వహించనున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) ముద్దమల్ల రాజేందర్ అన్నారు. పట్టణంలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాలలో వరంగల్ నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ ఆధ్వర్యంలో యువజన ఉత్సవాలను గురువారం జరిగాయి. ముఖ్య అతిథిగా డీఈవో రాజేందర్ హాజరయ్యారు. దేశ భవిష్యత్తును నిర్ణయించేంది యువతేనని అన్నారు. ప్రతి పౌరుడూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యువతలో దాగివున్న ప్రతిభను వెలికితీసి వారిని ఆయా స్థానాల్లో ఉన్నతులుగా తీర్చిదిదిద్దడానికే యువజనోత్సవాల పేరుతో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా యంగ్ రైటర్స్, ఆర్టిస్ట్స్, ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక జానపద నృత్యం, సైన్స్ ఎగ్జిబిషన్ తదితర పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బర్లస్వామి, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్, ట్రాన్స్‌కో ఏఈ చిట్యాల

ఫోన్ ఇన్

అధిక లోడ్ వల్లే విద్యుత్ అంతరాయాలు

ఆంధ్రజ్యోతి : ఇటీవల విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. దీంతో వేసవి దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారు. శాఖ పరంగా మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

ట్రాన్స్‌కో ఏఈ: మండల వ్యాప్తంగా ఓవర్‌లోడ్ కారణంగా వ్యవసాయం, గ్రామాల్లో గృహాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సీఎండీ, డీఈ, ఏడీఈ ఆదేశాలతో దీనిపై సర్వే నిర్వహించాం. అవసరమైన చోట కత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి : వ్యవసాయ విద్యుత్‌కు కోతలు లేకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

ట్రాన్స్‌కో ఏఈ: త్రీఫేజ్ విద్యుత్‌కు సంబంధించి చిట్యాల ఫీడర్‌లో 2, జూకల్లు -1, గిద్దెముతారం ఫీడర్‌లో 1 చొప్పున నాలుగు డీటీఆర్లు ఏర్పాటు చేశాం. నెలలో రెండో శనివారం విద్యుత్ లైన్ల వెంట సిబ్బందిని పంపించి తీగలకు అడ్డుగా చెట్లను తొలగిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ట్రాన్స్‌కో ఏఈ: గ్రామాల్లో అధిక లోడ్‌ను అధిగమించేందుకు మండలంలోని క్రోసూర్‌పల్లి, గిద్దెముత్తారం, కాల్వపల్లి, అందుకుతండా, ఒంటిప్పతండా, గోపాలపురం గ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. ఎండల తీవ్రత దృష్ట్యా ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఎర్తింగ్ సమస్యలు వస్తున్నాయి. సిబ్బందితో నీటిని పట్టిస్తున్నాం. గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించొచ్చు.

- చిట్యాల (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో హోలీ సందడి


భూపాలపల్లిలో రంగులు కొంటున్న పట్టణవాసులు

భూపాలపల్లిటౌన్, మార్చి 13: జిల్లాలో హోలీ పండుగ సందడి నెలకొంది. హిందూ మాసంలోని ఫాల్గుణ పౌర్ణమి రోజున శుక్రవారం ఈ వేడకపే జరుపుకొనేందుకు జనం సిద్ధమవుతున్నారు. ఎనిమిది రోజులుగా ఆడిన కాముడి (జాజిరి) ఆట గురువారం తొమ్మిదో రోజుతో ముగిసింది. మహిళలు, పిల్లలు, పెద్దలు జాజిరి ఆడుకుని గురువారం కోలలను కాల్చారు. తమ కష్టాలు తొలిగిపోవాలని తమ ఇష్టదైవాన్ని వేడుకున్నారు.

హోలీ వేడుకల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రంగుల దుకాణాలు వెలిశాయి. భూపాలపల్లిలోని మార్కెట్‌లో పావుకిలో రంగు ధర రూ. 60 నుంచి రూ.80 పలికింది. రంగుల విక్రయాలతో పట్టణంలోని ప్రధాన కూడళ్లు అంబేద్కర్ చౌరస్తా, గణేష్ చౌరస్తా రద్దీగా మారాయి.

విరగబూసిన మోదుగుపూలు

హోలీ పండుగ వచ్చిందంటే ప్రతి ఒక్కరికీ మోదుగుపూలు గుర్తుకు వస్తాయి. ప్రతి ఏడాది హోలీ నాటికి ఈ పుష్పం విరగబూస్తుంది. పట్టణంలోని పరిసర అటవీ ప్రాంతాల్లో ఈ పూలు కనులవిందు చేస్తున్నాయి.

కాళేశ్వరాలయంలో పదహారో పండుగ



తాళిబొట్టును చూపుతున్న త్రిపురారి కృష్ణమూర్తిశర్మ

మహదేవపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలంలోని పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో 16రోజుల క్రితం మహాశివరాత్రి జాతర కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు, వేద పండితులు ఘనంగా నిర్వహించారు. అయితే దానిని పురస్కరించుకుని గురువారం శుభానందదేవి, ముక్తీశ్వరుడికి అర్చకులు, వేద పండితులు అంగరంగ వైభవంగా పదహారో పండుగ కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి, ఫణకంటి నగేష్‌శర్మ, వేద పండితులు సుబహ్మణ్య శాస్త్రి, పాండేతో పాటు అర్చకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యం

- ప్రాజెక్ట్స్ సీఈ భీకంసింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్ట్స్ సీఈ భీకంసింగ్

ములుగు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ప్రాజెక్ట్స్ సీఈ భీకంసింగ్ అన్నారు. ములుగులో విద్యుత్ మండలాల అధికారులతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓవర్ లోడ్ నియంత్రణ, ఓవర్‌లోడ్ విద్యుత్ లైన్లను గుర్తించి మార్చడానికి తగిన ప్రణాళిక సిద్ధం చేసుకుని క్షేత్రస్థాయిలో పనులు పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా మిషన్ భగీరథ, ప్రభుత్వ ఆస్పత్రులు, ముఖ్యమైన ప్రభుత్వ సంస్థలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పది మండలాల ఏఈలు, ఏడీఈలు, ట్రాన్స్‌ఫార్మర్స్ డీఈ సదానందం, డీఈ ఆపరేషన్ పులుసం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు నమోదు

డోర్నకల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామ పంచాయతీకి చెందిన 14ఏళ్ల బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గ్రామానికి చెందిన రామకృష్ణ అనేవ్యక్తి 14ఏళ్ల బాలికను రేండేళ్లుగా లైంగికంగా వేధిస్తున్నట్లు చెప్పారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రామకృష్ణపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

15 లీటర్ల గుడుంబా పట్టివేత

వెన్నారం వద్ద ఓ ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 15 లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై ఉమ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. రామకుంటతండాకు చెందిన రాంబాబు, సునీత ద్విచక్రవాహనంపై గుడుంబా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో వెన్నారం వద్ద దాడులు చేపట్టినట్లు తెలిపారు. వారి వద్ద 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉమ తెలిపారు.

నేటి నుంచి కోటంచ జాతర

- మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా వేడుకలు

రేగొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో కోటంచ లక్ష్మీనరసింహస్వామి జాతర శుక్రవారం ప్రారంభం కానుంది. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడు రోజులపాటు ఈ వేడుకలు జరగనున్నాయి. 14వ తేదీన పెద్ద రథోత్సవం, ఎడ్లబండ్లు, వాహనాలు తిరగడం, 15న స్వామి వారు, అమ్మవార్లు గజవాహనాలపై తిరగడం, 16న స్వామి వారి నిజరూప దర్శనం, హంస వాహన సేవ, నాకబలి కార్యక్రమాలు అంత్యంత వైభవంగా జరుగుతాయి.

ముస్తాబైన ఆలయం

జాతరలో భాగంగా కోటంచ ఆలయంతోపాటు పరిసరాను విద్యుద్దీపాలతో అలంకరించారు. దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేసి చలువ పందిళ్లు వేశారు. అలాగే తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మించారు. తలనీలాలు సమర్పించే వారు స్నానాలు చేయడానికి షవర్లను బిగించారు. ట్రాఫిక్ సమస్య లేకుండా దుకాణ సముదాయాలను ఒకేచోట ఏర్పాటు చేశారు. ఆలయ పరి సరాల్లో వాహనాలు నిలపకుండా బారికేడ్లు నిర్మించారు.

భారీ బందోబస్తు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. డీఎస్పీ సంపత్‌రావు పర్యవేక్షణలో నలుగురు సీఐలు, 10 మంది ఎస్సైలు, 180 మంది ఇతర పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఆలయ పరిసరాలు, జంక్షన్లు, గ్రామ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నామని, 18 సీసీ కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నామని వివరించారు.



ఆలయంలో క్యూలైన్లతో పాటు ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

కోటంచకు ప్రత్యేక బస్సు సర్వీసులు : ఆర్టీసీ డీఎం

భూపాలపల్లిటౌన్(ఆంధ్రజ్యోతి) : రేగొండ మండలంలోని కొడవటంచ (కోటంచ) శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద జరిగే జాతరకు భూపాలపల్లి డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తున్నట్టు మేనేజర్ ఆమంచ ఇందు తెలిపారు. కొడవటంచ జాతరకు వచ్చే భక్తుల రద్దీని ఆధారంగా చేసుకుని బస్సులు వేస్తామని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని పేర్కొన్నారు. భూపాలపల్లి నుంచి కొడవటంచకు పెద్దలకు రూ.60, పిల్లలకు రూ.30 ఉంటుందని, అలాగే చెల్పూరు నుంచి పెద్దలకు రూ.50, పిల్లలకు రూ.30, గణపురం క్రాస్‌రోడ్డు నుంచి పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.30, భాగిర్తిపేట క్రాస్ నుంచి పెద్దలకు, పిల్ల లకు రూ.30 ఉంటుందని వివరించారు.

చిన్నకాళేశ్వరం పంప్‌హౌజ్‌లో ప్లాడింగ్ పనులు

కాటారం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గారెపల్లి స్టేజ్-2 పంప్‌హౌజ్ లో ప్లాడింగ్ పనులు జోరుగా సాగుతున్నాయి. గతంలోనే ఇక్కడ మోటార్లను బిగించగా ప్రస్తుతం ప్లాడిం గ్ (వాల్వ్‌ల వద్ద అల్యూమినియం షీట్లు బిగించడం), ఎలక్ట్రో మెకానికల్ పనులు జోరుగా సాగుతున్నాయి.



ప్లాడింగ్ పనులను పరిశీలిస్తున్న అధికారులు

గురువారం పనులను ఈఈ యాదదగిరి, డీఈఈ సూర్యప్రకాశ్, ఈఏ వెంకన్న పర్యవేక్షించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కాగా, పంప్‌హౌజ్ వద్ద రూ.4కోట్లతో నిర్మిస్తున్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగవంతమయ్యాయి. సబ్‌స్టేషన్‌లో 90శాతం పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. రెండు పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్)లకు ఓ పీటీఆర్‌ను బిగించారు. రెండో దాన్ని త్వరలో ఏర్పాటు చేసి సబ్‌స్టేషన్‌ను రన్నింగ్ స్టేజ్‌లోకి తీసుకురానున్నట్లు కాంట్రాక్ట్ నిర్వాహకులు తెలిపారు.

సదరం సర్టిఫికెట్‌కు బదులు యూడీఐడీ కార్డులు

- తప్పులు లేకుండా దరఖాస్తుల ప్రక్రియ నిర్వహించాలి
- ములుగు అదనపు కలెక్టర్ సంపత్‌రావు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంపత్‌రావు

ములుగు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్‌కు బదులు యూనిక్ డిసబిలిటీ ఐడీకార్డులు(యూడీఐడీ) అందజేయనున్నట్టు అదనపు కలెక్టర్ సంపత్‌రావు తెలిపారు. జిల్లాలోని మీసేవ నిర్వాహకులు యూడీఐడీ అప్లికేషన్స్‌పై అవగాహన కలిగి ఉండి ఎలాంటి తప్పులు లేకుండా ప్రాసెస్ చేయాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్‌తో కలిసి జిల్లాలోని మీసేవ కేంద్రాల నిర్వాహకులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంపత్‌రావు మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లు లేకుండా అప్లికేషన్స్ చేయాలని, త్వరలోనే డిసబులిటీ స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటుచేసి స్లాట్ తేదీలను తెలియజేస్తామన్నారు. ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ మాట్లాడుతూ మళ్లీ మీసేవ కేంద్రాలకు మంచిరోజులు రాబోతున్నాయన్నారు. త్వరలోనే కొత్తగా ఇన్సూరెన్స్, కొరియర్ సర్వీసులు, బ్యాంకు ఆధారిత కస్టమర్ సర్వీసులను పొందుపర్చనున్నామని అన్నారు. కొంతమంది మీసేవ నిర్వాహకులు అధిక రుసుము వసూలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. సెంటర్లలో ధరల పట్టికను ఫ్లెక్సీ రూపంలో ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ జగదీశ్, డీపీఎం పెన్షన్స్ రేవతి, టీజీటీఎస్ మేనేజర్ విజయ్, టీజీ ఆన్‌లైన్ మేనేజర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ కుటుంబానికి న్యాయం చేయాలి

- సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ మునిసిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లో భవానీనగర్ తండాకు చెందిన గిరిజన మహిళ డుంగ్రోత్ భూబి భూమిని సీపీఐ ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవానీ నగర్‌తండాకు చెందిన డుంగ్రోత్ భూబి మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌బీ ఆఫీస్ సమీపంలో గల సర్వే నెంబరు 538/1లో సుమారు 500 గజాల స్థలాన్ని 2002 సంవత్సరంలో కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని చెప్పారు. 2012లో ఆ భూమికి ఎల్‌ఆర్‌ఎస్ ఉత్తర్వులు కూడా పంపడం జరిగిందన్నారు. కొంత కాలం క్రితం 551 సర్వే నెంబర్ పేరిట సదరు భూమిని రెవెన్యూ అధికారులు సర్వేచేసి రెడ్‌క్రాస్ సొసైటీకి కేటాయించినట్లు చెప్పారు. దీంతో ఆ భూమి వివాదాస్పదంగా మారిందని, దీనికి పరిష్కారం చూపాల్సింది రెవెన్యూ, మునిసిపల్ అధికారులేనని పేర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించి గిరిజన మహిళకు న్యాయం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో డుంగ్రోతు గోపి, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, రమేష్, శ్యాంప్రసాద్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

వస్తువుల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

- జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్

మహబూబాబాద్ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చైతన్య సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వినియోగదారులు కొనే ప్రతీ వస్తువుపై ఎమ్మార్పీ రేటు ఉండటంతో పాటు ఎక్స్‌పైరీ తేదీ కూడా ఉంటుందని, వాటిని పరిశీలించి వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. నిత్యం ప్రజలు వాడే వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉంటూ నాణ్యమైనవస్తువులను కొనుగోలు చేస్తూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. మామిడాల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఇన్‌చార్జి వింజమూరి సుధాకర్, వినియోగదారుల రక్షణమండలి కార్యదర్శి షైన శ్రీనివాస్, జిల్లా ఆహార సేఫ్టీ అధికారి ధర్మేంద్ర, హెచ్‌ఎం సిరినాయక్, బోనగిరి ప్రసాద్, జానీ, విష్ణువర్ధన్, పట్టాబి లక్ష్మయ్య, వాసుదేవ్ పాల్గొన్నారు.



వినియోగదారుల చట్టం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రేమ్‌కుమార్, తదితరులు



ట్రాప్ కెమెరాలకు చిక్కని పులి

కాటారం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ డివిజన్ అడవుల్లో టెర్రిటరీ (ఆవాస ప్రాంతం)గా ఏర్పాటు చేసుకునే దిశగా గత నెలలో ప్రవేశించిన పెద్దపులి కంటికి కునుకు లేకుండా చేస్తోంది. సుమారు 20 కిలోమీటర్ల రేడియస్‌లో సంచరిస్తూ ఫారెస్టు అధికారులను ముప్పు తిప్పలు పెడుతోంది. కాటారం మండలంలోని వీరాపూర్ బీట్ అడవుల్లో మంగళవారం లేగదూడపై దాడి చేసి చంపిన పులి మళ్లీ ఇప్పటి వరకు అటువైపు రాలేదని తెలుస్తోంది. లేగదూడను చంపిన ప్రదేశంతో పాటు సమీపంలో పాదముద్రల ఆధారంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాల్లో పులి జాడ చిక్కలేదని సమాచారం. సాధారణంగా పశువును చంపిన మరుసటి రోజు తినడానికి పులి వస్తుందని ట్రాకర్ల అభిప్రాయం. మూడు రోజుల వుతున్నా పులి ఇటువైపు రాకపోవడంతో ఎటు వెళ్లిందోనని అటవీ శాఖ అధికారులు తలపట్టుకుంటున్నారు. లేగదూడను చంపిన రోజున పగ్‌మార్క్స్ (పులి పాదముద్రలు) ఆధారంగా అన్నారం అడవుల వైపు వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి కాటారం, మహదేవపూర్ ఎఫ్‌ఆర్వోలు స్వాతి, రవికుమార్ నేతృత్వంలో పలువురు అధికారులు, సిబ్బంది పలు బృందాలుగా ఏర్పడి పులి జాడ కోసం అడవులను గాలిస్తున్నారు. నీటి వనరులు, కాలి బాటల మీదుగా పులి పాదముద్రల కోసం కిలోమీటర్ల మేర తిరుగుతున్నారు. దాడి చేసి చంపిన లేగదూడను తినడానికి రాకపోవడంతో పులి అడవుల్లోని జింకలు, దుప్పులు, అడవి పందులను తింటున్నట్టుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కవ్వాల్ అభయారణ్యం నుంచి పులి జాడ కోసం వచ్చిన ట్రాకర్లు, డివిజన్ పరిధిలోని అడవుల్లో సంచరించేది మగ పులిగా గుర్తించినట్లు తెలుస్తోంది. పులి ఈ అడవుల్లో స్థావరం కోసం హద్దులను ఏర్పాటు చేసుకోవచ్చని వారు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని సమాచారం. పులి సాధారణంగా పగలంతా దట్టమైన అటవీ ప్రాంతంలో విశ్రమించి రాత్రి పూట సంచరిస్తోందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రజలు, పశువులు, మేకల కాపరులు అడవుల్లోకి వెళ్లొద్దని, పులికి హాని కలిగించే చర్యలు చేపట్టొదని అధికారులు హెచ్చరిస్తున్నారు.



వీరాపూర్ బీట్ అడవుల్లో పెట్టిన ట్రాప్ కెమెరా



ఎంచగూడెం జాతరలో ఊరేగిస్తున్న కొమ్మలమ్మ పడిగెలు

వైభవంగా కొమ్మలమ్మ జాతర

కొత్తగూడ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం ఎంచగూడెంలో వాసం వంశస్తుల ఇలవేల్పు కొమ్మలమ్మ జాతర వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ జాతరలో గురువారం సాధిరెడ్డిపల్లిలోని వాసం నాగయ్య ఇంటి నుంచి మెత్తిపానుపును తీసుకువచ్చి, గద్దెపై ఏర్పాటు చేశారు. గోపాలపురంలోని వాసం వీరస్వామి ఇంటిలో పూజలు చేసి, కానుకను తీసుకువచ్చి ఎంచగూడెంలోని కొమ్మలమ్మ జాతర గద్దెపై ప్రతిష్ఠించారు.అనంతరం కొమ్మలమ్మ దేవత ప్రతిమను, పడిగెలను గ్రామంలో సంప్రదాయ డప్పు వాయిద్యాలు మోగిస్తూ, ఆదివాసీల నృత్యా లు, శివసత్తుల పూనకాల నడుమ పడిగెలను ఊరేగించారు. జాతర ప్రాంగణంలో అగ్నిగుండాలు దాటుతూ భక్తుల మధ్య పడిగెలను, కొమ్మలమ్మ దేవత ప్రతిమను గద్దెపై ఏర్పాటు చేశారు. అనంతరం పూజలు నిర్వహించగా రాత్రి కల్యాణోత్సవం జరిపారు. ఈ సందర్భంగా వాసం సమ్మయ్య తలపతి, ఆలూరి కృష్ణపటేల్, వాసం వీరస్వామి తలం నిర్వహించారు. ఆలూరి బచ్చయ్య, శ్రీను, యాలం లక్ష్మయ్య వడ్డెపూజారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో వాసం కుమారస్వామి, వాసం వీరస్వామి, పాపయ్య, ఆలూరి సమ్మయ్య, వాసం ప్రభాకర్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందుతాగి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మరిపెడ మండలం కుడియాతండాలో చోటు చేసుకుంది. ఎస్సై సతీశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆ తండాకు చెందిన ఇస్లావత్ శంకర్ (54) మద్యానికి బానిసై నిత్యం తాగుతు న్నాడు. మద్యం తాగవద్దని భార్య మందలించడంతో క్షణికావేశంతో పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు గుర్తించి, చికిత్స కోసం ఆయన్ను మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అభ్యసనా సామర్థ్యాల పెంపునకు ఏఐ దోహదం

- జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ద్వారా భాషా గణిత సామర్థ్యాల సాధన (ఎఫ్‌ఎల్‌ఎన్)పెంపునకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువా రం సమగ్ర శిక్ష తెలంగాణ విద్యాశాఖ మౌలిక భాషాగణిత సామర్థ్యాల సాధన కార్యక్రమంలో భాగంగా జిల్లా నుంచి ఎంపికైన 7 ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలు, ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎం, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ ఏఐ కృత్రిమ మేధను విద్యారంగంలో అమలుచేయ డం చాలా ఉపయోగకరమైన ఆలోచన అని, ఎంపికైన పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల సామర్థ్యాలను పెం పొందించేలా బోధన చేయాలన్నారు. ఏఐ బోధన తక్కువ అభ్యసన స్థాయిలు కలిగిన విద్యార్థులకు వారి వారి స్థాయిలకు అనుగుణంగా ప్రశ్నలను తయారు చేసి వారిలో అభ్యసన సామర్థ్యలు పెరిగేలా ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నా ప్రాథమికస్థాయిలో భాషలో అభ్యసనా సామర్థ్యాలతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియల్లో వెనుకబాటులోనే ఉంటున్నారని తెలిపారు. కృత్రిమ మేధ సాయంతో ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానంగా 3, 4, 5 తరగతుల విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన సామర్థ్యాలను సాధించ డం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో ఆర్పీలుగా క్వాలిటీ కంట్రోలర్ ఆజాద్‌చంద్రశేఖర్, ఎంఈవో రవికుమార్, కాంప్లెక్స్ హెచ్‌ఎం. విజయ్‌కుమార్, ఎస్టీటీ యాదగిరి వ్యవహరించారు.



ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

భార్యను కొట్టి చంపిన కేసులో భర్త అరెస్టు

సీరోలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం ఉప్పరగూడెం శివారు బూరుగుచెట్టు తండా జీపీ పరిధిలోని మాంజాతండాలో మాంసంకూర వండలేదని భార్యను కొట్టి చంపిన భర్త మాలోతు బాలును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మరిపెడ సీఐ రాజ్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా సీరోలు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాలోతు బాలు అరెస్టును చూపి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మాంజాతండాలో ఈనెల 11న గిరిజన వృద్ధురాలు మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు పూర్తయ్యాక తండావాసులంతా యాటపోతును కోసుకొని పోగులు వేసుకున్నారు. ఈ క్రమంలో బాలు ఇంటికి తీసుకువచ్చిన మాంసాన్ని అదేరోజు రాత్రి వండాలని భార్య కళావతితో ఘర్షణ పడి తీవ్రంగా కొట్టి ఇంటినుంచి వెళ్లిపోయాడు. అదే తండాలో ఉంటున్న కళావతి తల్లిదండ్రులు ఇస్లావత్ లక్ష్మీ-వెంకన్న ఈనెల 12 ఉదయం తెల్లవారాక కూతురు ఇంటికి వచ్చి చూసే సరికి మృత్యువాత పడిఉంది. వెంటనే సీరోలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తును వేగవంతం చేశారు. కళావతిని తీవ్రంగా గాయపరిచి ఆమె మృతికి కారణమై భర్త బాలును గురువారం మన్నెగూడెం సమీపంలోని మిర్చి ప్లాంటు వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సమావేశంలో ఎస్సై నగేష్, సిబ్బంది పాల్గొన్నారు.



బాలు అరెస్టును చూపుతున్న సీఐ రాజ్‌కుమార్, ఎస్సై నగేష్

ఆల్ ఇన్ వన్.. అల్లాపురం

» రంగుల ప్రపంచంలో వరంగల్ కుర్రాడి ప్రతిభ
» నటుడిగానే కాకుండా పలు విభాగాల్లో రాణిస్తున్న దామోదర్
» కథా, పాటల రచయితగానూ సత్తా
» ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీతో ఔత్సాహికులకు నటనలో శిక్షణ


'రైతన్న మేలుకో' షూటింగ్ స్టిల్ (ఫైల్)

వరంగల్ సిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కళలకు పుట్టినిల్లు.. కాకతీయులు ఏలిన వరంగల్ గడ్డపై పుట్టిన అల్లాపురం దామోదర్ రంగుల ప్రపంచంలో ప్రతిభ చాటుతున్నారు. ఆరోతరగతి చదువుతున్నపుడే 'ఆడది అబలకాదు.. జగతికే మూలమైన ఆదిపరాశక్తిరా..' అంటూ రాసిన కవితతో తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల ప్రశంసలు అందుకున్న దామోదర్‌ను.. సరదాగా రాసిన కవితలు, పాడిన పాటలు రచయితగా, గాయకుడిగా, నిర్మాతగా, దర్శకుడిగా, నటుడిగా వెండి, బుల్లి తెరపై కళామతల్లి ఒడిలో కూర్చోబెట్టాయి. స్వశక్తితో వెండి తెరకు పరిచయమై ఓ వెలుగు వెలుగుతున్న వరంగల్ కళాకారుల జాబితాలో దామోదర్ కూడా స్థానం సంపాదించుకున్నారు. ప్రస్తుతం దామోదర్ ఓదెల 2, హస్తినాపురం సినిమాల్లో నటిస్తున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం, వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు దంపతులు అల్లాపురం రాజయ్య, కనుకబాయికి మూడో సంతానంగా 1977లో జన్మించిన దామోదర్.. డిగ్రీ వరకు చదివారు. 1999లో తాను రాసిన పాటలు పదిమందికి తెలియాలనే ఉద్దేశంతో సొంత డబ్బులతో గాయకులు దీకొండ సారంగపాణి, అశోక్, సునిత ఆలపించిన ప్రేమాంజలి ఆడియో క్యాసెట్‌తో తనకళామయ జీవితానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత పాటలు రాయడం, సినిమా, షార్ట్ ఫిలిమ్స్‌కు కథలు అందించడం, స్ర్కీన్‌ప్లే, నటిచడం, నిర్మాతగా, దర్శకుడిగా సినిమాలు, షార్ట్‌ఫిలిమ్స్ రూపొందించారు. అలాగే పాన్ ఇండియా సినిమా లాగానే 'అనుకున్నానే ఆనాడు' అనే పాటను తెలుగులో రాసి.. ఆ తర్వాత దానిని కన్నడ,తమిళ్, మళయాళం, హిందీ, మరాఠీ, బంజారా ఏడు భాషల్లో రాయించి వీడియో చిత్రీకించి చేసి విడుదల చేశారు.


హీరో విజయ్ దేవరకొండతో దామోదర్

యూట్యూబ్‌లో ఆదరణ

నటుడిగా, కథకుడిగా, పాటల రచయితగా, స్ర్కీన్‌ప్లే, నిర్మాతగా, దర్శకుడిగా అల్లాపురం దామోదర్ చేతిలో రూపుదిద్దుకున్న పలు పాటలు, షార్ట్‌ఫిలిమ్స్ యూట్యూబ్, ఇన్‌స్టాలో ఆదరణ పొందాయి. వాటిలో రైతుల కష్టాలను చూపే కన్నీటిధార, విలువలను తెలిపే గుండెలపై మోసే నాన్న, ఊరిడిసిన కొడుకు కథ (సాంగ్), ఎంతపని చేస్తివే ఓటమ్మ పాటలతో పాటు కేస్ క్లోజ్ షార్ట్‌ఫిలిం, తోడబుట్టిన తోడు, గల్లగురిగి, లవ్ ట్రావెల్ ఇండిపెండెంట్, ఇల్లరికం అల్లుడు, ఆర్ఎస్‌నంద వంట మనిషి కామెడీ షార్ట్‌ఫిలిమ్స్ లక్షల్లో వ్యూస్ సంపాదించాయి. వీటితో పాటు ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీ నుంచి సుమారు 50 షార్ట్‌ఫిలిమ్స్, 30 వీడియో సాంగ్స్ తీశారు. రచయితగా, దర్శకుడిగా ప్రస్తుతం రైతన్న మేలుకో షూటింగ్ జరుగుతోంది. ప్రయాణంలో పరిచయం, గున్నమామిడి కొమ్మమీద లాంటి రెండు సినిమాలకు దామోదర్ కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం వహించారు. యూట్యూబ్‌లో పెట్టిన సినిమాలు, షార్ట్‌ఫిలిమ్స్, వీడియో సాంగ్స్ వల్ల దామోదర్‌కు నెలకు 30 నుంచి 40 వేల వరకు ఆదాయం వస్తోంది.

స్వయం కృషినే నమ్ముకున్న దామోదర్

1999లో ప్రేమాంజలితో మొదలైన ప్రయాణం అంచలంచలుగా ఎదుగుతూ వచ్చారు. పాటలు, కథా, రచనలను తీసుకుని దామోదర్ హైదరబాద్‌లోని ప్రముఖ నిర్మాతలను, నటులను, దర్శకులను కలిసిన పలితం కనిపించేదు.దీంతో దామోదర్ స్వశక్తిని నమ్ముకున్నారు. తన మిత్రులు, పరిచయస్తులతో కలిసి ప్రయాణంలో పరిచయం, గున్నమామిడి కొమ్మమీద లాంటి


కెమెరామెన్‌కు సూచనలు ఇస్తున్న దామోదర్ (ఫైల్)

సినిమాలకు కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం వహించారు. అవి అనుకున్నంత హిట్ కాలేదు. అయినా పట్టువదలని విక్రమార్కుడిలా తక్కువ బడ్జెట్‌తో షార్ట్ ఫిలిమ్స్‌ను నిర్మిస్తూ వస్తున్నారు. కొన్ని తన (ఏడీఆర్) బ్యానర్‌లో నిర్మిస్తుండగా, కొన్ని వేరే వాళ్ల బ్యానర్‌లో నిర్మించే వాటికి నటుడిగా, కథ, స్ర్కీన్‌ప్లే, దర్శకత్వం బాధ్యతలను చూస్తున్నారు. మరోపక్క హనుమకొండలోని బాలసముద్రంలో ఏడీఆర్ ఫిలిం ఫ్యాక్టరీని స్థాపించి ఔత్సాహిక కళాకారులకు నటనలో శిక్షణ ఇస్తున్నారు.

వరంగల్‌ను షూటింగ్‌లకు వేదిక చేయడమే లక్ష్యం : అల్లాపురం దామోదర్



కళలకు పుట్టినిల్లు ఓరుగల్లు. ఇక్కడ కళాకారులకు కొదువలేదు. లొకేషన్లకు కొదువలేదు. కావాల్సిందల్లా.. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని లొకేషన్లు అద్భుత కళాఖండాలు. వాటిని సద్వినియోగం చేసుకుంటే నిర్మాతలకు రూ.కోట్లు ఖర్చు తప్పు తుంది. మంచి మంచి కళాకారులు కూడా ఉన్నారు. కావా ల్సిందల్లా 24 క్రాఫ్ట్స్ సంబంధించిన సినీ, టీవీ, నాటక కళాకా రులందరినీ ఒకే వేదికపైకి తీసు కురావడం. అదే జరిగితే ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వర్క్ షేరింగ్‌తో సినిమాలు రూపొందించవచ్చు. ప్రభుత్వ సహకారంతో పాటు కళాకారులంతా సహకరిస్తే స్టూడియో కూడా ఏర్పాటు చేసుకుని సినిమా షూటింగ్‌లకు వరంగల్‌ను వేదికగా చేయాలనేదే సంకల్పం.

ప్రపంచ శాంతి కోసం ప్రార్థించాలి

• వరంగల్ బిషప్ ఉడుమల బాల • ముగిసిన ఫాతిమామాత మహోత్సవం


సందేశమిస్తున్న బిషప్


హాజరైన క్రైస్తవులు

కాజీపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థించాలని, క్రైస్తవులు పశ్చాతాపం, పరివర్తన, ప్రార్థనా జీవితంతోనే జీవించాలని వరంగల్ బిషప్, విశాఖ అగ్ర పీఠాధిపతి డాక్టర్ ఉడుమల బాల క్రైస్తవులకు పిలుపునిచ్చారు. రెండు రోజులుగా కాజీపేట ఫాతిమానగర్ కెథడ్రల్ చర్చిలో జరుగుతున్న ఫాతిమామాత ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం బిషప్ హౌస్ నుంచి కెథడ్రల్ చర్చి వరకు ఓపెన్‌టాప్ వాహనంలో వచ్చిన బిషప్‌కు క్రైస్తవులు ఘన స్వాగతం పలికారు. చర్చికి చేరుకున్న బిషప్ సమష్టి దివ్య బలిపూజ సమర్పించారు. అనంతరం బిషప్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. మెదటి ప్రపంచ యుద్ధాన్ని నిలిపివేసింది ఫాతిమా మాతే అన్నారు. ఈ జూబ్లీ ఏడాదిలో పండుగను జరుపుకోవడం ప్రపంచ శాంతి నెలకొన్న నేపథ్యంతో అన్నారు. పోర్చుగల్ దేశంలో ముగ్గురు చిన్నారులకు ఫాతిమా మాత కనిపించి ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని చెప్పిందని గుర్తు చేశారు. అంతకుముందు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు బెంగళూరు అగ్రపీఠం ఫాదర్ మెస్సీ గ్నేర్ ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు చేశారు. కాజీపేట విచారణ గాయక బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక గీతాలు ఆలపించారు. క్రైస్తవులు పెద్దఎత్తున కెథడ్రల్ చర్చి, మరియమాత గుహ వద్దకు చేరుకుని ప్రత్యేక మొక్కులు చెల్లించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విశాఖ అగ్రపీఠాధిపతిగా ఎన్నికైన డాక్టర్ ఉడుముల బాలను వరంగల్ డయాసిస్ కౌన్సిల్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా కెథడ్రల్ విచారణ కౌన్సిల్ అధ్యక్షుడు బొక్క దయాసాగర్, మాజీ డిప్యూటీ సీఎం డాక్టర్ రాజయ్య, 49 డివిజన్ కార్పొరేటర్ మానస రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మాయమాటలకు మోసపోవద్దు

తెలియని యాప్‌లు, ఫోన్ కాల్స్, లింక్‌లకు స్పందించొద్దు

» సైబర్ క్రైం జరగగానే 1930 కాల్ చేయాలి
» స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు కావాలి
» సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్
» 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

వరంగల్ క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): 'సాంకేతికంగా వస్తున్న మార్పులను సైబర్ నేరస్థులు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వారు చెప్పే మాయమాటలకు అత్యాశకు పోతున్న వారు కొందరు, అమాయక ప్రజలు కొందరు మోసపోతున్నారు. సైబర్ నేరస్థుల వలలో చిక్కి విలవిలలాడుతున్నారు' అని వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ కూజ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఇటీవల సైబర్‌మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను గురువారం 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఫోన్ చేసి ఏసీపీ ద్వారా తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ క్రమంలో ఏసీపీ ప్రజలకు పలు సలహాలు ఇచ్చారు. తెలియని వ్యక్తులను నమ్మి, ఆకర్షణీయమైన ప్రకటనలు చూసి ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడులు పెట్టడం, ఆన్‌లైన్ యాప్‌ల నుంచి రుణాలు తీసుకోవద్దని, భౌతికంగా చూడని విషయాలను అసలు నమ్మొద్దన్నారు. ఆన్‌లైన్ మోసానికి గురైనట్టు అనుమానం రాగానే క్షణాల్లో (గోల్డెన్ అవర్) ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్‌చేస్తే డబ్బులు డ్రా చేయకుండా ఆపొచ్చన్నారు. ఒకసారి సైబర్ నేరస్థులు డబ్బులు డ్రా చేసుకుంటే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉండదని వివరించారు. 1930 ద్వారానే సైబర్ క్రైంకు సత్వర పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. రూ.10లక్షల లోపు అయితే స్థానిక పోలీస్‌స్టేషన్, రూ.10లక్షలకు పైగా ఉంటే కమిషనరేట్ కార్యాలయంలోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఫోన్‌ఇన్‌కు వచ్చిన కాల్స్‌లో కొన్ని..

● లోన్‌యాప్‌లో రుణాన్ని చెల్లించినా గుర్తుతెలియని వ్యక్తులు నాతో పాటు నా సంబంధికులకు ఫోన్లు చేసి వేధిస్తున్నారు. ఏం చేయాలి?

- శివ, వరంగల్

ఏసీపీ : లోన్‌యాప్‌ల జోలికి వెళ్లొద్దు. మీ సంబంధీకులకు ఫోన్ చేస్తే ఎవరూ పరిగణలోకి తీసుకోవద్దని చెప్పండి. కొద్ది రోజులు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పెట్టండి. సెల్‌ఫోన్‌లో యాప్ తీసేయాలి. లేదంటే కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు వస్తే ఫోన్ రీసెట్ చేసి ఇస్తాం.

● ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఓ ఖాతాకు రూ.2,72,000 డబ్బులు వేసి మోసపోయాం. 1930కు ఫోన్ చేసినా ఇప్పటి వరకు డబ్బులు రికవరీ కాలేదు.

-షాకీర్, పరకాల

ఏసీపీ : 1930 ఫోన్ చేసి వదిలేస్తే సరిపోదు. వివరాలన్నీ చెప్పిన తర్వాత ఫిర్యాదులో చెప్పింది వాస్తవమేనని మీ ఫోన్ నెంబర్‌కు ధ్రువీకరణ మెసేజ్ వస్తుంది. దాని ఆధారంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయించాలి. ఆ తర్వాత ఫ్రీజింగ్ అయిన డబ్బులు మీ ఖాతాలోకి వస్తాయి. కేవలం మెసేజ్ ఒక్కటే వచ్చి కేసు నమోదు కాకపోతే డబ్బులు జమ కావు.

● మార్టిగేజ్ లోన్‌లో ఒక కిస్తీ చెల్లించనందుకు నా ఫోన్ హ్యాక్ చేసి నగరంలోని ఓ ప్రముఖ కంపెనీ వేధిస్తోంది.

- సంపత్‌కుమార్, మెడికల్ షాపు నిర్వాహకుడు

ఏసీపీ : లోన్ కిస్తీ చెల్లించనందుకు ఫోన్ చేసి వేధించడం నేరం. మీకు లేదా మీకు ష్యూరిటీ పెట్టిన వారికి లీగల్ నోటీసులు ఇవ్వాలి. ఓ ప్రముఖ కంపెనీ ఈ విధంగా వ్యవహరించడం సరికాదు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయసహాయం పొందండి. ఆఫ్‌లైన్‌లో రుణం తీసుకున్నందున సైబర్ క్రైంతో దీనికి ఎలాంటి సంబంధం ఉండదు.

● ప్రకృతి విలేజ్ మార్ట్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయాం. తిరిగి డబ్బులు ఎలా పొందాలి..?

- భాస్కర్, వరంగల్

ఏసీపీ : భౌతికంగా వ్యక్తులతో మాట్లాడి నమ్మకంతో పెట్టుబడి పెట్టారు కనుక ఇది సైబర్ క్రైం కిందికి రాదు. చీటింగ్ కేసు కిందికి వస్తుంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందొచ్చు.

● తరచుగా ఏపీకే ఫైల్స్ రావడం, అనవసరమైన ఫోన్ వస్తున్నాయి. ఆపడం ఎలా..?

- కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లి

ఏసీపీ : తెలియని వారి నుంచి వచ్చిన ఏపీకే ఫైల్స్, యుఆర్ఎల్ లింక్‌లను ఓపెన్ చేయకూడదు. దాని ద్వారా ఫోన్లు హ్యాక్ అయ్యే ప్రమాదం ఉంది. అన్ వాంటెడ్ ఫోన్ కాల్ వచ్చిన వెంటనే ఫోన్‌కు మెసేజ్‌లు వస్తుంటాయి. మళ్లీ కాల్ చేయాలా.. వద్దా.. అని దానికి నో అని బదులు ఇవ్వాలి. ఫోన్ సెట్టింగ్స్‌లలో ఆప్షన్స్ ఉంటాయి వాటిలోనైనా అన్ వాంటెడ్ మెసేజ్‌లు, ఫోన్స్ రాకుండా సెలెక్ట్ చేసుకోవచ్చు. మాల్‌వేర్ సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అయినా ఇదే విధంగా ఏపీకే ఫైల్స్, కుప్పలు, కుప్పలుగా మెసేజ్‌లు వస్తుంటాయి. మా దగ్గరికి వచ్చినా, లేదా భూపాలపల్లిలో ఉన్న జిల్లా సైబర్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్‌కు వెళ్లినా మీ ఫోన్‌ను క్లీన్ చేసి ఇస్తారు.

● ఫేస్‌బుక్‌లో సిమెంట్ డీలర్‌షిప్ ఇస్తారన్న ప్రకటన చూసి రూ.2,12,000 చెల్లించి మోసపోయాం. ఏమి చేయాలి ?

- రమేశ్, ధర్మసాగర్

ఏసీపీ : ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు చూసి మోసపోవద్దు. వ్యక్తులను ప్రత్యక్షంగా కలిసి వాస్తవమేనని నమ్మకం కలిగిన తర్వాతే పెట్టుబడి పెట్టాలి. ముందుగా 1930కు ఫిర్యాదు చేసి తర్వాత స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించండి. డబ్బులు ఫ్రీజ్ అయితే అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ అవుతుంది. లేదంటే వ్యక్తి పట్టుబడ్డప్పుడు మీరు పెట్టిన కేసు ద్వారా నిందితుడిని జైలుకు తరలించవచ్చు.




ఫోన్‌ఇన్‌లో సందేహాలను నివృత్తి చేస్తున్న సైబర్ క్రైం ఏసీపీ విజయ్ కుమార్

హస్తంలో.. ఐక్యత సాధ్యమేనా?

(5వ పేజీ తరువాయి)

నామినేటెడ్ పదవుల భర్తీ చేయాల్సి ఉంది. అయితే ఇప్పటికే విభేదాలతో ఎమ్మెల్సీ సీటు చేజార్చుకున్న ఓరుగల్లు నేత మధ్య విభేదాలు ఇలాగే కొనసాగితే.. టీపీసీసీలో కూడా పదవులు రావటం కష్టమే అనే చర్చ జరుగుతోంది. దీంతో వరంగల్ నేతల మధ్య ఉన్న విభేదాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని అగ్రనేతలు మంత్రులకు సూచనలు చేస్తున్నట్టు సమాచారం. ఇటీవల జరిగిన క్యాబి నెట్ సమావేశంలో స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్‌తో పాటు మరో మూడు ఉమ్మడి జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఉన్న విభేదాలను ప్రస్తావించినట్లుగా సమాచారం. ఎమ్మెల్యేలను కలుపకపోవాల్సిన బాధ్యత మం త్రులపైనే ఉందని సీఎం సూచించినట్టు సమాచారం. తొలుత ఎమ్మెల్యేలతో విందు, మరో సారి ఎమ్మెల్యేలకు సంబంధించిన పెండింగ్ పనులు, బిల్లులు, ఇతర వాటిపై దృష్టిపెట్టాలని అధిష్టానం నుంచి కూడా ఆదేశాలు వచ్చినట్లుగా సమాచారం. సీఎంతో పాటు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి వస్తున్న ఆదేశాలతో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు, ఇన్‌చార్జ్ మంత్రులు రంగంలోకి దిగినట్టు ప్రచారం జరుగుతోంది.

ఎమ్మెల్యేలకు మంత్రి సీతక్క విందు..

హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి సీతక్క ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు బుధవారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఆమె ఆహ్వానం అందుకున్న ఎమ్మెల్యేలు, నేతలు ఆలోచనలో పడ్డారని, కొందరు ఎమ్మెల్యేలు మర్యాదపూర్వకంగా విందుకు వెళ్లినట్టుగా సమాచారం. అయితే ఈ విందులో పార్టీపదవులు, నామినేటెడ్ పదవుల పరమైన ఎలాంటి చర్చ జరగనప్పటికి అధికారంలోకి వచ్చిన ఏడాది తరువాత మంత్రి సీతక్క విందు ఏర్పాటు చేయటంపై ఎమ్మెల్యేల్లో చర్చ జరిగినట్టు సమాచారం. ఎమంత్రి విందుకు పిలిచింది వాస్తవమే.. భోజనం చేసినం.. సంప్రదాయం ప్రకారం దుస్తులు కూడా పెట్టారు. అంతే రాజకీయాలు ఏం మాట్లాడుకోలేదు.' అని ఓ ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కాగా, విభేదాలు ఉన్న ఎమ్మెల్యేలు కూడా పరస్పరం అభివాదం చేసుకుని, మాట్లాడుకోవటం కాంగ్రెస్‌లో ఐక్యతకు ఈ విందు ఎంతో కొంత ఉపయోగపడుతుందనే అంచనాల్లో కాంగ్రెస్ అగ్రనేతలున్నారు. మరో మంత్రి కొండా సురేఖ కూడా త్వరలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలకు విందు ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్టు సమాచారం. మొత్తంగా అధిష్టానం ఆదేశాలతో రంగంలోకి దిగిన మంత్రులు ఎమ్మెల్యేలతో సత్సంబధాలు కొనసాగిస్తూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా అభ్యర్థుల ఎంపికతో పాటు విజయం వరకు ఐక్యంగా.. సమష్టిగా కృషి చేసేలా కాంగ్రెస్ అధిష్టానం ప్రయత్నాలు చేస్తోంది. ఈ విందు రాజకీయాలు ఎంత వరకు విజయవంతమవుతాయోననే చర్చ కూడా జరుగుతోంది.

భర్త హత్యకు భార్య సుపారీ

» రెండేళ్లుగా విడిగా ఉంటున్న భార్యాభర్తలు
» కోపంతో భర్తను చంపించేందుకు ప్లాన్
» ముఠాగా ఏర్పడి రెక్కీ నిర్వహించిన నిందితులు
» బాధితుడికి బెదిరింపు కాల్‌తో బెడిసికొట్టిన స్కెచ్
» భార్యతో పాటు నలుగురిని అరెస్టు చేసిన నర్సంపేట పోలీసులు

నర్సంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): భర్త హత్యకు భార్య సుపారీ ఇచ్చింది. గొడవలతో రెండేళ్లుగా విడిగా ఉంటున్న భర్త.. తనను పట్టించుకోవడం లేదని కోపం పెంచుకుని ఈ దారుణానికి ఒడిగట్టింది. వరంగల్ నగరంలో ఇటీవల డాక్టర్‌ను అతడి భార్య సుపారి ఇచ్చి హత్య చేయించిన సంఘటన మరువక ముందే ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్న భర్తను హతమార్చేందుకు భార్య పన్నిన కుట్ర కలకలం రేపుతోంది. హత్యకు సుపారీ తీసుకున్న వారిలో ఒకరు అత్యాశతో బాధితుడికి బెదిరింపు కాల్ చేయడంతో ప్లాన్ బెడిసికొట్టి సూత్రధారులు, పాత్రధారులంతా కటకటాలపాలయ్యారు. ఈ ఘటన నర్సంపేట మండలంలో గురువారం వెలుగు చూసింది. నర్సంపేట ఎస్సై జి. అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

నర్సంపేట మండలం ఆకులతండాకు చెందిన ధారావత్ సుమన్‌కు ఇదే మండలంలోని మహేశ్వరం గ్రామానికి చెందిన మంజులతో 2018లో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కూతురు ఉంది. సుమన్ హైదరాబాద్‌లోని ఐడీబీఎల్ బ్యాంకులో మేనేజర్ పనిచేస్తున్నాడు. అయితే భార్యాభర్తలు తరచూ గొడవపడడం, మనస్పర్థలతో రెండేళ్ల నుంచి వేర్వేరుగా ఉంటున్నారు. పంచాయితీకి పిలిస్తే భర్త రావడం లేదని, కలిసి కాపురం చేయడం లేదన్న అక్కసుతో భర్తపై మంజుల కక్ష పెంచుకుంది. భర్తను ఎలాగైనా హతమార్చాలని నిర్ణయించుకుంది. పది రోజుల కిందట ఆకులతండాలోని తనకు దగ్గరి పరిచయస్తుడైన మూడు గోపితో హోలీ పండుగ లోపు తన భర్త హత్య చేయాలని, ఇందుకోసం ఎన్ని డబ్బులైనా ఇస్తానని మంజుల ఒప్పందం కుదుర్చుకుంది. ముందుగా ఖర్చుల కోసం రూ.30వేలు ముట్టచెప్పింది. దీంతో గోపి తనకు తెలిసిన క్యాబ్ డ్రైవర్లు మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన మల్లేష్, వరంగల్ జిల్లాలోని రాయపర్తికి చెందిన బానోత్ నరేష్, మంజులకు బావ వరుసైన ములుగు జిల్లా అన్నంపల్లికి చెందిన మోతీలాల్ ముఠాగా ఏర్పడ్డారు. సుమన్‌ను హత్య చేయడం కోసం మొదట హైదరాబాద్‌లో పని చేసే బ్యాంకు వద్ద ఆరా తీశారు. అతడు ఎప్పుడు వెళ్తాడు..? ఎప్పుడు ఇంటికి వస్తాడు..? అనే విషయాలపై రెక్కీ నిర్వహించి ఆ తర్వాత హతమార్చాలనుకున్నారు.

ఇలా హత్యకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న క్రమంలోనే ముఠాలోని ఒకరు బానోత్ నరేష్ డబ్బులు వసూలు చేయాలన్న అత్యాశతో సుమన్‌కు ఈ నెల 4న ఫోన్ చేశాడు. నువ్వు డబ్బులిస్తే నీకు సంబంధించిన ఒక ముఖ్యమైన విషయం చెబుతానని, లేదంటే నిన్ను చంపేస్తామంటూ బెదిరించాడు. కంగారు పడిన సుమన్ తనకు ఫోన్ చేసిన వ్యక్తి గురించి ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. ఈ నెల 9న నర్సంపేట పోలీసులకు జరిగిన విషయంపై ఫిర్యాదు చేశాడు. సుమన్‌కు చేసిన ఫోన్‌కాల్‌తో పోలీసులు బానోత్ నరేష్‌ను పట్టుకొని విచారించి హత్య కుట్రను ఛేదించారు. నరేష్ ద్వారా కుట్ర సూత్రధారి మంజుల, మూడు గోపి, మల్లేష్, మోతీలాల్‌ను బుధవారం అరెస్టు చేసి విచారించగా హత్య కుట్రను ఒప్పుకున్నారు. ఇదే రోజు రాత్రి నిందితులైన ఐదుగురిని కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ వివరించారు.

అనాథలకు అండగా..

» ఆశ్రయం కల్పిస్తున్న మాతృభూమి చారిటబుల్ ట్రస్టు
» పెంచి, చదివిస్తున్న నిర్వాహకులు
» ఇటీవల ఇద్దరు యువతులకు వివాహాలు
» ఆదర్శంగా నిలుస్తున్న మోహన్‌రావు దంపతులు


అనాథల ఆలనాపాలన చూస్తున్న డాక్టర్ మోహన్‌రావు, వినోద దంపతులు

నర్సంపేట టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయస్సులోనే కన్న తల్లిదండ్రులను కోల్పోయి.. అయిన వారు లేక అనాథలైన ఇద్దరు చిన్నారులను చేరదీసి ఆశ్రయం కల్పించి.. తల్లిదండ్రుల్లా సాకి.. ఓనమాలు దిద్దించి.. ఉన్నత చదువులు చదివించి.. వారికి వివాహాలు చేసి.. ఆదర్శంగా నిలిచారు ఆ దంపతులు. నర్సంపేటలో మాతృభూమి చారిటబుల్ ట్రస్టు పేరుతో ఆశ్రమం ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు నర్సంపేట పట్టణానికి చెందిన డాక్టర్ అర్శనపెల్లి మోహన్‌రావు, వినోద దంపతులు. ఎన్ఆర్ఐ రవిచందర్ సహకారంతో పట్టణంలోని అంగడికి సమీపంలో 2006లో మాతృభూమి చారిటబుల్ ట్రస్టు అనాథాశ్రమాన్ని నెలకొల్పారు. మొదట వృద్ధులకు ఆశ్రయం కల్పించి చేరదీసిన నిర్వాహకులు ఆ తర్వాత అనారోగ్యంతోనో మరే ఇతర కారణాలతో తల్లిదండ్రులు మరణించడం, అయినవారు కూడా లేక అనాథలుగా మిగిలిన చిన్నారులను చేరదేసి పెంచడంతో పాటు వారికి అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆశ్రమంలోని అనేక మంది విద్యార్థులు బీటెక్, ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్నారు. కొందరు బీటెక్ పూర్తిచేసి ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు ట్రస్టు నిర్వాహకులు.

ఇద్దరి వివాహాలు చేసిన దంపతులు

అనాథలైన రోజా, నాగరాణిలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించిన మోహన్‌రావు, వినోద దంపతులు వారికంటూ ఓ జీవితాన్నిచ్చేందుకు ఈనెల 12న ఆదర్శ వివాహాన్ని దగ్గరుండి జరిపించారు. నర్సంపేట మండలం బోజ్యానాయక్‌తండాకు చెందిన పాపవత్ బిచ్చునాయక్, బుల్లెమ్మ దంపతులు మరణించడంతో వారి సంతానమైన 9ఏళ్ల రోజా ఆమె చెల్లెలు, సోదరుడికి 2007లో ఆశ్రయం కల్పించారు. 1వ తరగతి నుంచి బీటెక్ వరకు చదివించారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో రోజా ఉద్యోగం సాధించింది. తన దూరపు బంధువులు చూసిన బోడ గణేష్‌తో వివాహం నిశ్చయం కావడంతో వారికి తమ సొంత ఖర్చులతో ట్రస్టు నిర్వాహకులే వివాహం జరిపించారు. అలాగే 2009లో ఆశ్రమంలో చేరిన చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామానికి నాగరాణిని బీఎస్సీ వరకు చదివించగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది. ఈ క్రమంలో తాను ప్రేమించిన నర్సంపేట పట్టణానికి చెందిన నిమ్మల రాకేష్‌తో ఆదర్శ వివాహం జరిపించారు. ఈ క్రమంలో మోహన్‌రావు, వినోద దంపతులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ ఒక్కరు అనాథలకు అండగా నిలవాలన్నారు. తాము సంపాదించే దానిలో కొంత సమాజ సేవకు ఉపయోగించాలనే లక్ష్యంతోనే అనాథ యువతలకు అండగా ఉంటూ వారి వివాహాలను జరిపిస్తున్నామన్నారు.


యువతులు రోజా, నాగరాణి

రాజకీయ నేతలతో సమావేశం కావాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

ములుగు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19లోగా ఓటరు జాబితా, ఇతర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన హైదరాబాద్ నుంచి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సి.హెచ్.మహేందర్‌జీ, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి మూడు నెలలకోసారి పకడ్బందీగా అప్‌డేట్ కావాలని, 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి పౌరుడికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. ఓటరు జాబితా సవరణ, పోటీచేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్‌స్థాయి ఏజెంట్ల నియామకం, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో మార్చి 19లోపు సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలన్నారు. సమావేశాలు నిర్వహించే సమయంలో మీటింగ్ మినిట్స్ పకడ్బందీగా నమోదు చేసుకోవాలని, సమావేశానికి హాజరైన ప్రతినిధుల సంతకాలను ప్రత్యేక రిజిష్టర్‌లో తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్, ఇతర వివరాలను మార్చి 27లోపు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని సూచించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో, అదేవిధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్ల ఆధ్వర్యంలో రాజకీయపార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించాలన్నారు. నూతన ఓటరు నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి వివరాల తొలగింపు, వివిధ అంశాలకు వాడే ఫారం-6,7,8లో వివరాలను పూర్తిస్థాయిలో వివరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తహ సీల్దార్ విజయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హోలీని ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్పీ

ములుగు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలు హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ శబరీశ్ కోరారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటనలో పలు సూచనలు చేశారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోలీ పండుగ జరుపుకుని కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఉల్లాసంగా గడపాలని సూచించారు. చర్మానికి, పర్యావరణానికి హానికరం కాని సహజ రంగులను ఉపయోగించాలని, నీటి బెలూన్లు, గాజు పొడి కలిపిన రంగులు వాడొద్దని, ఇతరులపై బలవంతంగా రంగులు చల్లకుండా పరస్పర గౌరవంతో పండుగ జరుపుకో వాలని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే, ప్రజలకు అసౌకర్యం, ప్రమాదం కలిగించే ఏచర్య అయినా తీవ్రంగా పరిగణించబడుతుందని అన్నారు. హోలీ పండుగను ప్రేమ, ఐక్యత, సంతోషాన్ని విస్తరించేలా జరుపుకోవాలని ఆయన సూచించారు.

వేసవి సమస్యలపై అధికారుల సమావేశాలు

తాగునీటి ఎద్దడి, వడదెబ్బ నివారణ చర్యలపై చర్చ



కన్నాయిగూడెం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాలరావు

తాడ్వాయి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో వేసవిలో నీటి ఎద్దడి, పరిష్కార మార్గాలు, వడదెబ్బ నివారణ చర్యలపై గురువారం సమీక్ష జరిగింది. ఆయా శాఖల అధికారులతో ఎంపీడీవో సుమనవాణి సమావేశమై పలు అంశాలను చర్చించారు. వేసవి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలను మెరుగు పరుచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రేగ కేశవరావు, డిప్యూటీ తహసీల్దార్ సురేష్ బాబు, ఎంపీవో శ్రీధర్ రావు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్యులు, ఐసీడీఎస్, ఈజీఎస్ సిబ్బంది, గ్రామీణ నీటి సరఫరా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- మంగపేట (ఆంధ్రజ్యోతి) : మంగపేటలోని గంపోనిగూడెం రైతు వేదిక భవనంలో అధికారులు సమావేశమయ్యారు. తాగునీటి ఎద్దడి, నీటి సరఫరా, వడదెబ్బ నివారణ తదితర అంశాలపై మండల ప్రత్యేక అధికారి సిద్ధార్థ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఎంపీడీవో బి. భద్రునాయక్, తహసీల్దార్ తోట రవీందర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీవో మమత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ యాకయ్య, ఎంఈవో పి.మేనక, మండల వ్యవసాధికారి నేదునూరి చేరాలు, ఏఈవోలు, ఏపీవోలు, వైద్యాధికారులు కేజీబీవీ, జడ్పీహెచ్‌ఎస్, యూపీఎస్ హెడ్మాస్టార్లు, వార్డెన్‌లు, ఐకేపీ ఏపీవో తదితరులు పాల్గొన్నారు.
- కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి డీఎంహెచ్‌వో గోపాలరావు హాజరయ్యారు. వడదెబ్బ లక్షణాలు, నివారణ చర్యలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, మెడికల్ ఆఫీసర్లు అభినవ్ భాగవతుల, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.
- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత నేపథ్యంలో వడదెబ్బ నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని అధికారులను ఏటూరునాగారం మండల ప్రత్యేక అధికారి రామ్‌పతి ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా, వడదెబ్బ కేసులు పెరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ జగదీశ్వర్, ఎంఈవో కొయ్యడ మల్లయ్య, ఏపీవో చరణ్‌రాజు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలు తలెత్తొద్దు : చీఫ్ ఇంజనీర్

భూపాలపల్లిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ సమస్యలు తలెతకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చీఫ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ భీకంసింగ్ విద్యుత్ అధికారులకు సూచించారు. భూపాలపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏడీఈలు, ఏఈలతో ఆయన సమావేశమయ్యారు. వేసవిలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. 33 ఇంటర్‌లింకింగ్ లైన్స్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే ఎస్టిమేట్ చేసి అదనంగా ఏర్పాటు చే యాలని సూచించారు. కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేసి ఓవర్‌లోడ్‌ను నియంత్రించాలన్నారు. ఈ సందర్భంగా ఇంటర్‌లింకింగ్ లైన్లను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో డివిజనల్ ఇంజనీర్ పాపిరెడ్డి, ఎంఆర్‌టీ సదానందం, టెక్నికల్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవిత జన్మదిన వేడుకలు

కృష్ణకాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను టీజేఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం ఘనంగా నిర్వహించారు. టీజేఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చీకటి గణేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. టీజేఎస్ఎఫ్ నాయకులు సందీప్‌గౌడ్, గెల్లి హరీష్, గాజుల మనోజ్, శ్రీనాథ్, ప్రదీప్, లోహిత్, భార్గవ్‌రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు గురువారం జాగృతి జిల్లా నాయకుడు అంతటి రాము ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా నాయకులు రామప్ప రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీదేవిపేట గ్రామంలోని పదోతరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లు పంపిణీ చేశారు. జాగృతి నాయకులు గునిగంటి హరీష్, ముడిగె రాజ్‌కుమార్, పోలం శ్రావణ్, మూడ్ తిరుపతి, బొల్లవేని రమేష్, జంగిలి శ్రీకాంత్, సాగర్, రాజు, ఉదయ్ పాల్గొన్నారు.

వైభవంగా దోపోత్సవం



హనుమంతవాహనంపై లక్ష్మీనరసింహస్వామి

రేగొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం కోటంచలో దోపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బుచ్చమాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం పూజలు, బలిహరణం, హోమం నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీనరసింహ స్వామిని అలంకరించిన హనుమంత వాహనంలో ఊరేగించారు. ఊరేగింపుగా వస్తున్న లక్ష్మీనరసింహస్వామి వస్తువులను దొంగిలించడమే దోపోత్సవం. ఈ సంప్రదాయాన్ని గ్రామానికి చెందిన పద్మశాలీ కులస్థులు రాత్రి సమయంలో జరిపుతుంటారు. చిన్నరథంలో స్వామి వారిని ఊరేగింపుగా తీసుకొస్తున్న క్రమంలో భక్తులు మారువేషంలో వచ్చి స్వామి వారి వస్తువులను దొంగిలించారు. ఈ ఉత్సవంలో మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున పాల్గొని సందడి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భిక్షపతి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా గోదావరి హారతి



గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు

మహదేవపూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : కాళేశ్వరంలో గోదావరి హారతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా ని ర్వహిం చారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు ప్రతి పౌర్ణమికి ఈ కార్యక్రమాన్ని చేపూడుతున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా కాళేశ్వరాలయ ప్రధా న అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ, ఆలయ అర్చకులు, అధికారులు గురువారం సాయంత్రం కాళేశ్వరాలయం నుంచి డప్పుచప్పుళ్లతో గోదావరి నదికి చేరుకున్నారు. అక్కడ దీప ధూప నైవేద్యాలతో మంత్రాలతో గోదావరికి హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మహేష్, ఉప ప్రధాన అర్చకులు ఫణీంద్రశర్మ ఇతర అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కవయిత్రి మొల్ల జయంతి వేడుకలు

మహదేవపూర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐబీ విశ్రాంత భవన ఆవరణలో కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను శాలివాహన సంఘం రాష్ట్ర నాయకుడు సముద్రాల తిరుపతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మొల్ల చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ చల్లా తిరుపతిరెడ్డి, ఇరిగేషన్ శాఖ ఏఈ రవి, శాలివాహన సంఘం నాయకులు సందీప్, రాజశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్ఎస్‌పై అవగాహన సదస్సు

కాటారం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో సమావేశ మందిరంలో గురువారం మండలంలోని ఎల్‌ఆర్ఎస్ లబ్ధిదారులకు అవగాహన సద స్సు ఏర్పాటు చేశారు. మండల పంచాయతీ అధికారి వీరస్వామి, టౌన్ ప్లానింగ్ అధికారి సునీల్ ఎల్‌ఆర్ఎస్‌పై ప్రభుత్వ నిబంధనలు, ప్రయోజనాలు, రాయితీ వివరాలు, ఫీజుల చెల్లింపు తదితర అంశాలపై వివరించారు. పంచాయతీ కార్యదర్శులు సమీర్‌ఖాన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎంపీ డీకే అరుణ వ్యాఖ్యలు ఖండనీయం

భూపాలపల్లిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ పార్లమెంట్‌లో మాట్లాడటం ఖండనీయమని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాల్మీకి బోయలు విద్యా, ఉద్యోగాల పరంగా ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, వారికి షెడ్యూల్డ్ తెగల జాబితాలో చేర్చాలని ఎంపీ మాట్లాడడం విడ్డూరమని విమర్శించారు.

నేడు డయల్ యువర్ డీఎం

భూపాలపల్లిటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేసినట్లు డీఎం ఇందు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు ఇది కొనసాగుతుందని పేర్కొన్నారు. డిపో పరిధిలోని వివిధ మండలాలు, గ్రామాలకు చె ందిన వారు తమ సమస్యలను మొబైల్ నంబర్ 9959226707 కాల్ చేసి దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

ములుగు జిల్లా పరిధిలో..

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా పరిధిలోని ప్రజలు శుక్రవారం నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్-2 డిపో మేనేజర్ వి.జ్యోత్స్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12నుంచి ఒంటి గంట వరకు జరిగే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు పాల్గొని 9959226048కు ఫోన్‌చేసి సమస్యలు, సలహాలు అందజేయాలని ఆమె కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి : డీపీవో

రేగొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు అన్నారు. కోటంచలో గురువారం ఆయన పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్యాన్ని పాటించని పలువురు వ్యాపారులకు రూ. 2 వేల చొప్పున జరిమానా విధించారు. కోటంచ జాతరలో 30మంది పంచాయతీ కార్మికులు, 20 మంది కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. దుకాణాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, ఆయన వెంట ఎంపీవో రాంప్రసాద్, గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ మైథిలి, కార్యదర్శులు జీవిత, జ్యోతి, మౌనిక, నరేష్, శ్రీకాంత్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఏబీవీపీ

చిట్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ రాష్ట్ర ప్రాంత హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ హేమకు గురువారం వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆయన వెంట ఏబీవీపీ చిట్యాల నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ ఉన్నారు.

'నెరవేరబోతున్న కాంట్రాక్ట్ కార్మికుల కల'

కృష్ణకాలనీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కల నెరవేరబోతుందని భూపాలపల్లి కోల్‌మైన్స్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ లేబర్ యూనియన్ ఇన్‌చార్జి కోలా నాగేంద్రబాబు అన్నారు. సింగరేణి గెస్ట్‌హౌజ్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు త్వరలోనే పెరగనున్నాయన్నారు. ఈనెల 11న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఐఎన్‌టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్, కనీస వేతనాల బోర్డు చైర్మన్ నర్సింహారెడ్డి యూనియన్ సభ్యులతో సమావేశమై కార్మికులు సమస్యలు తెలుసుకు న్నారన్నారు. వేతనాలు పెంచాలని కోరగా వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

గ్రామ పంచాయతీ సిబ్బందికి సన్మానం

తాడ్వాయి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి గ్రామ పంచాయతీ ఏపీవో శ్రీధర్‌రావు, కార్యదర్శి రాజశేఖర్‌తోపాటు సిబ్బందిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోల్లు దేవేందర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు గురువారం సన్మానించారు. 11న కొండపర్తి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన విజయవంతానికి సహకరించిన పంచాయతీ సిబ్బందికి మంత్రి సీతక్క ఆదేశాల మేరకు సన్మానిస్తున్నట్టు తెలిపారు. లచ్చుపటేల్, సాంబయ్య, సునీల్, రాజేందర్, రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

మంగపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా కార్యకర్తలు కృషి చేసి, తద్వారా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డితో కలిసి గురువారం పర్యటించారు. కార్యకర్తలను కలిసి దిశా నిర్దేశం చేశారు. మంగపేటలోని తెలంగాణ సెంటర్‌లో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారం భించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ గుమ్మడి సోమయ్య, జిల్లా అనుబంధ సంఘాల నాయకులు బి.జగన్మోహన్‌రెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, పెద్ది నర్సింహారావు, పల్లికొండ యాదగిరి, మాజీ జడ్పీటీసీ సిద్ధంశెట్టి వైకుంఠం, మాజీ ఎంపీపీ పచ్చ శేషగిరిరావు, మాజీ ఎంపీటీసీలు మండవ రామకృష్ణ, చింత సురేష్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్లు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, కొంకతి సాంబశివరావు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి కారుపోతుల నర్సయ్యగౌడ్, మండల అనుబంధ సంఘాల అధ్యక్షుడు చాద మల్లయ్య, హిదయతుల్లా, ఆదినారాయణ, నూకల రాజేష్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ అధికారులను మ హేందర్‌జీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో యాసంగి సన్నాహక సమావేశం జరగ్గా ఆయన మాట్లాడారు. ఎఫ్ఏక్యూ ధాన్యం మాత్రమే కొనుగోలు చేసి మిల్లు ట్యాగ్ చేసిన రైస్‌మిల్లుకు పంపించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా పౌరసరఫరాల అధికారి రాంపతి, కోఆప రేటివ్, డిస్ట్రిక్ట్ రూరల్ డెవలప్‌మెంట్, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్, హార్టికల్చర్, మార్కెటింగ్, అగ్రికల్చర్, ఎఫ్‌సీఐ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

పంట నష్టం వివరాలు నమోదు

వాజేడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న నకిలీ విత్తనాలతో నష్టపోయిన పంట వివరాలను రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు గురువారం మండలంలోని కొంగాలలో పరిశీలించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు రెండు రోజులుగా జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయిగుడెం మండలాల్లో విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారులు పర్యటిస్తున్నారు. మొక్కజొన్న పంటను పరిశీలించి కంకులలో మక్కలు లేకపోవడాన్ని చూసి అవాక్కైయ్యారు. ఎన్ని రోజుల క్రితం పంట వేశారు, ఏ కంపెనీ నుంచి పంటను వేశారు, ఆడ విత్తనాలు, మగ విత్తనాలకు ఎన్ని రోజుల వ్యవధిలో విత్తనాలు నాటారు? అని రైతుల నుంచి వివరాలు సేకరించారు. జేడీఏ సీడ్స్ లక్ష్మణ్, డీడీ శంకరయ్య, ఏడీఎస్పీలు సంతోష్, వేమా, ఎస్సీవో అపర్ణ, వేణుమాధవ్, ఏవో మహేష్ ఉన్నారు.

కన్నాయిగూడెం మండలంలో..

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంతనపల్లి, గుర్రేవుల, బుట్టాయిగూడెం, ముప్పనపల్లి తదితర గ్రామాల్లో బొండు మొక్క జొన్న పంటను విత్తన ధ్రువీకరణ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. జేడీఏ సీడ్స్ లక్ష్మణ్, డీడీ శంకరయ్య, ఏడీఎస్‌సీ సంతోష్ తదితరులు పర్యటించారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి మహేష్ ఉన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

కాటారం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని చింతకాని క్రాస్ వద్ద 353 (సీ) జాతీయ రహదారిపై గురువారం లారీ అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఇసుక కోసం వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్ర మత్తులో డివైడర్‌పైకి లారీని ఎక్కించినట్లు స్థానికులు తెలిపారు. దీంతో లారీ ముందు భాగం ధ్వంసమైంది.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్



సమావేశంలో మాట్లాడుతున్న రవిచందర్

ములుగు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతేకాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బనోత్ రవిచందర్ అన్నారు. జిల్లాలోని రైతుల పంటలకు సాగునీరు అందించేందుకు మంత్రి ధనసరి అనసూయ సీతక్క కృషి చేస్తున్నారని తెలిపారు. ములుగులో గురువారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో మన ప్రాంతం నుంచి పక్క నియోజకవర్గాలకు సాగునీటిని తరలించుకుపోయిన బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు. రైతుల పొలాల వద్దకు వెళ్లి నీటిని ఇవ్వడంలేదని రెచ్చగొడుతున్నారని, సరైన పద్ధతి కాదని అన్నారు. అదేవిధంగా రామచంద్రాపురం ప్రాంతానికి నీటిని అందించడానికి భూసేకరణకు సహకరించిన ప్రతి రైతుకూ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈసమావేశంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఎమ్డీ.చాంద్‌పాషా, నాయకులు జక్కుల రేవంత్, అభినయ్‌చారి, గుండ భిక్షపతి , తిప్పారపు కిషన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం



గోవిందరావుపేటలో సీఎం, మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గోవిందరావుపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టిన సందర్భంగా మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింత క్రాంతి ఆధ్వర్యంలో నాయకులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రూ.6 వేలకోట్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.3 లక్షల చొప్పున 5 లక్షల మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి అందేలా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయడం గర్వించతగ్గ విషయమని అన్నారు.ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, నాయకులు కొంపెల్లి శ్రీనివాసరెడ్డి, దాసరి సుధాకర్, కణతల నాగేందర్‌రావు, జంపాల ప్రభాకర్, తేళ్ల హరిప్రసాద్, పులుగుజ్జు వెంకన్న, సాయిబాబు, పెండెం శ్రీకాంత్, గొంది కిరణ్, రామ్మోహన్, మద్దాలి నాగమణి, గుండెబోయిన నాగలక్ష్మి, చాపల ఉమాదేవి, రేగుల అరవింద్, రమేష్, వికాస్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ యూత్ కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోట నాగేష్, జాడి రాంబాబు, తాటి రాజబాబు, సుమన్ తదితరులు పాల్గొన్నారు

వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగావకాశం

ఏటూరునాగారం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం ఐటీడీఏ పరిధిలోని ఏజెన్సీ మండలాల్లో వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ప్రాతిపదికన సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాతా శిశు ఆరోగ్యం, ఎపిడెమిక్ బృందం(మొబైల్ హెల్త్ టీమ్) విభాగంలో మొత్తం మూడు పోస్టులు ఉన్నాయని, అభ్యర్థులను ఒక సంవత్సరం కాంట్రాక్ట్ పద్ధతిన నియమిస్తామని పేర్కొన్నారు. ఈనెల 21 సాయంత్రం 5 గంటలలోగా ఐటీడీఏలోని జిల్లా ఉప వైద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

నేడు తిరుక్కల్యాణ వేడుకలు

వెంకటాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈసందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయయడం జరిగిందని, చలువ పందిళ్లు, విద్యుత్, తాగునీటి వసతి కల్పించినట్లు పేర్కొంది. తిరుక్కల్యాణ మహోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కమిటీ కోరింది.

శంబాజీని ఆదర్శంగా తీసుకోవాలి : బీజేపీ

ములుగు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహరాజ్ తనయుడు శంబాజీ మహరాజ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని సినిమా థియేటర్‌లో ఆయన పాఠశాల విద్యార్థులతో కలిసి శంబాజీ మహరాజ్ జీవితచరిత్రతో తీసిన ఛావా చిత్రాన్ని వీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మన దేశంపై ఎంతోమంది దాడిచేసినా హిందూమతం జోలికి రాకుండా ఎందరో మహానుభావులు అండగా ఉండి కాపాడారని అన్నారు. అందులో శివాజీ మహరాజ్, శంబాజీ మహరాజ్, ఝాన్సీరాణి, రుద్రమదేవి వంటి వారు ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జినుకల కృష్ణాకర్‌రావు, నాయకులు రవిరెడ్డి, రాయంచు నాగరాజు, అప్పాని సురేష్, సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరించొద్దు : ఏఎస్పీ

వాజేడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. మండలంలోని మురుమూరులో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. తెల్లవారుజామునే గ్రామంలోకి సీఆర్పీఎఫ్ బలగాలతో ప్రవేశించిన ఆయన ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోకి కొత్తగా వచ్చిన వ్యక్తుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మావోయిస్టుల సమాచారం తెలిస్తే పోలీసులకు సమచారం ఇవ్వాలని, వారికి ఎటువంటి సహయ సహకరాలు అందించకూడదని తెలియజేశారు. అదే విధంగా రోడ్డు ప్రమాదాలపై ఆయన అవగాహన కల్పించారు. అతివేగంతో వాహనాలు నడపొద్దని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. గంజాయి, గుట్కా, గుడుంబాలకు బానిసలు కావద్దని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆయన వెంట వాజేడు ఎస్సై రాజ్‌కుమార్, సీఆర్పీఎఫ్ జవానులు ఉన్నారు.